విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 14 అక్టోబరు 2025 8 పేజీలు

యథేచ్ఛగా రేషన్ దందా

- పొరుగు జిల్లాలకు రేషన్ బియ్యం అక్రమ రవాణా
- రవాణాలో అధికారుల సహకారం
- కార్యాలయానికే పరిమితమైన సివిల్ సప్లై అధికారులు
- రేషన్ షాపుల తనిఖీలపై ఊసే ఎత్తని అధికారులు
- మిల్లర్లతో డీటీలు, ఎఫ్ఐలు మిలాఖత్

విశాలాంధ్ర-పీసీపల్లి : పౌరసరఫరాల శాఖను అవినీతి జలగలు పట్టిపీడిస్తున్నాయి. పాలకులు అధికారులు మారినా పద్ధతి మాత్రం మారడం లేదు కొత్త అధికారులు వచ్చినప్పుడు కాస్త హడావుడి చేసినా ఆ తర్వాత సరామామూలే..! ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే రేషన్ బియ్యం వారికి చేరే విధంగా చూడాల్సిన అధికారులు, సిబ్బంది అవినీతి ఉచ్చులో కూరుకుపోతున్నారు. మిల్లర్లు బియ్యర్లుతో మిలాఖత్ అయి నెల నెలా రేషన్ డీలర్ల వద్ద మామూళ్లకు పాల్పడుతున్నారు. ఒకవైపు రాజకీయ జోక్యం మరోవైపు అవినీతి జలగలతో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం యథేచ్ఛగా నల్లబజారుకు తరలిపోతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. పౌరసరఫరాల శాఖలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన అవినీతి జలగలు మామూళ్ల రూపంలో రక్తం పీల్చినట్టు పీలుస్తున్నారు. రేషన్ డీలర్ల వద్ద నుండి నెల నెల ముక్కు పిండి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూసేందుకు పౌరసరఫరాల శాఖలో జిల్లా ఉన్నతాధికారులతో పాటు డివిజన్ స్థాయి అధికారులు ఫుడ్ ఇన్స్పెక్టర్లు డిటిలు ఉన్నారు. అయితే వీరి విధి నిర్వహణను పక్కనపెట్టి వ్యాపారులతో మిలాఖత్ అవుతున్నారని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. గోదాముల నుండి రేషన్ షాప్ కు వెళ్లిన బియ్యం కార్డుదారులకు అందుతున్నాయో మిగతా 2 లో ...

సముద్ర అలల తాకిడికి యువకుల మృతి బాధాకరం

కలెక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర - చీరాల : సముద్రం అలల తాకిడికి ఐదు మంది యువత మృతి చెందడం బాధాకరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న బీచ్‌ల వద్ద రాబోయే రోజుల్లో ఈ లాంటి సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం చీరాల మండలం, బీచ్ ఓడరేవు సమీపంలో సముద్రం అలలకు ఐదు మంది యువత మృతి చెందిన సంఘటనపై సోమవారం రాత్రి ఓడరేవు బీచ్ వద్ద గాలింపు చర్యలను ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడుతో కలసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న బీచ్‌ల వద్ద రాబోయే రోజుల్లో ఈ లాంటి సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఆదివారం సాయంత్రం చీరాల మిగతా 2 లో ...

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

7 లో..

మినీ బస్సు బోల్తా

- ఒకరు మృతి, పలువురికి గాయాలు
- సకాలంలో స్పందించిన జిల్లా పోలీసులు

విశాలాంధ్ర-ఒంగోలు : డ్రైవర్ నిద్రమత్తులో రోడ్డుపై ఉన్న కల్వర్టును ఢీకొట్టడంతో మినీ బస్సు కాల్వలో పడిపోయిన ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. చిత్తూరు జిల్లా పలమనేరు నుండి ఎలక్ట్రికల్ డిపార్ట్మెంటుకు చెందిన వారు 20 మంది విజయవాడకు వెళ్తూ ఉండగా సోమవారం వేకువజామున స్థానిక రైస్ కాలేజీ దాటిన తర్వాత మినీ బస్సు డ్రైవరు వినోద్ నిద్రమత్తులో రోడ్డు సైడ్ ఉన్న కల్వర్టును ఢీకొట్టడంతో బస్సు పక్కన ఉన్న కాలువలో పడిపోయింది. మినీ బస్సులో ప్రయాణిస్తున్న చిత్తూరు జిల్లా గంగవరం మండలం పత్తికొండ గ్రామానికి చెందిన కామాటం చరణ్ కుమార్ (35) ప్రమాదంలో మృతిచెందారు. అతను పత్తికొండ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య ప్రీతీ, నాలుగు సంవత్సరాల వయసు కలిగిన ఒక పాప ఉన్నారు. ఆ ఘటనలో బాలసుబ్రమణ్యం, బొమ్మనపల్లి బాలకృష్ణ, రవ్వల రాజేష్, తిమిదేలపాటి దినేష్, నంగిలి మహేష్,వలిగట్ల ప్రసాద్, సోహేల్, విరాజీ గౌరీ శంకర్, గుండ్ల కట్టమంచి పృథ్వీ, ఖాదర్ బాషా సికిందర్, ఆకుబోతు శ్రీనివాస్, నాయక్ సూరేపల్లి రామ్మోహన్ బాబు, సురేంద్ర నాయుడు. గాటి మురుగేష్, హరికుమార్ మిగతా 2 లో ...

యాంత్రీకరణతో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి

మంత్రి స్వామి

విశాలాంధ్ర - సింగరాయకొండ : రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా వ్యవసాయ అభివృద్ధి ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యంగా చర్యలు చేపట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా బాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు. సోమవారం కొండపి నియోజకవర్గం సింగరాయకొండ మండల పరిధిలోని కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ సమావేశంలో మంత్రి స్వామి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్ కమిటీలను బలోపేతం చేస్తూ క్షేత్ర స్థాయిలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం మూడు విడతలుగా ఆర్థిక సహాయం అందిస్తుందని ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా రైతులకు మేలు చేయాలని ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని రైతులు కూడా సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకోవాలని యాత్రీకరణతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. సింగరాయకొండ, టంగుటూరు లో ఏపుగా పెరిగిపోయిన జామాయిల్ చెట్ల బహిరంగ వేలం చేపట్టి దాని ద్వారా వచ్చిన నిధులను మార్కెట్ కమిటీ ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. ముందుగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన పాలక మండల సమావేశంలో పాల్గొని మార్కెట్ యార్డ్ అభివృద్ధి, మౌలిక వసతుల సదుపాయాల గురించి ఈ సమావేశంలో సమీక్షించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యాడ్ ప్రాంతంలో మొక్కలు నాటి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికై నిరంతరం కృషి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా మండల పరిధిలోని విద్యుత్తు రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కల్తీ మద్యాన్ని అరికట్టాలి

మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

7 లో

కల్తీ మద్యం మాఫియా దోషులను శిక్షించాలి

వరికూటి అశోక్‌బాబు

6 లో

యథేచ్ఛగా రేషన్ దందా

(మొదటిపేజీ తరువాయి)

లేదు చూడటంతో పాటు అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు కార్యాలయానికే పరిమితమవుతూ తమ పరిధిలోని వ్యాపారులతో మిలాఖత్ అవుతున్నారు. నెల రావటమే ఆలస్యం మామూళ్ల కోసం పాకులాడుతున్నట్లు సమాచారం. రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. పక్క జిల్లాలకు నిత్యం ఆటోలు మినీ లారీల ద్వారా అక్రమంగా రేషన్ బియ్యం రవాణా అవుతున్నప్పటికీ అధికారులు మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్నారు. ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో తప్ప అక్రమ రేషన్ బియ్యం పట్టుకున్న దాఖలాలు లేవు బియ్యం పట్టుకున్న సందర్భాల్లో సైతం 6ఏ కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అంతేకాక ఏ ఒక్క కేసులో నిందితులకు శిక్ష పడకపోవడం విశేషం దాంతో బియ్యం స్మగ్లర్లు కొన్ని రైస్ మిల్లు యజమానులు నిర్భయంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి మళ్లీ ప్రజలకే అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం సరఫరా చేస్తుండడం ప్రజలు అక్కడే వాటిని రేషన్ షాప్ డీలర్లకు పది రూపాయలకు అన్ని డబ్బులు తెచ్చుకుంటుండగా మరికొందరు ఏకంగా డీలర్లకు తమకు వచ్చిన బియ్యాన్ని నేరుగా దళారులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఏదైతేనేమి ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో 80 శాతానికి పైగా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. రేషన్ షాపుల్లో ఈపాస్ మిషన్లు అమలులో ఉండటంతో దొంగ రేషన్ కార్డులు పూర్తిగా కనుమరుగయ్యాయి. నియోజకవర్గ పరిధిలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసే చిరు వ్యాపారులు బడా వ్యాపారులు అనేక మంది ఉన్నారు. ఈ బియ్యాన్ని నిత్యం ఆటోల ద్వారా మినీ లారీల ద్వారా ఇతర జిల్లాలకు తరలించి అక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పాలక పక్ష నేతలు అధికార ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ నేతలు సొమ్ము చేసుకుంటున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. రేషన్ షాప్ డీలర్లు అధికారులు రాజకీయ నాయకులు వాటాలు పంచుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పౌరసరఫరాల అధికారులే కాదు రెవెన్యూ శాఖ అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. చివరకు ప్రోటోకాల్ ఖర్చులు కూడా రేషన్ అవినీతి సొమ్ము వినియోగిస్తున్నారంటూ పలువురు గుసగుసలాడు కుంటున్నారు. అప్పుడప్పుడు తనిఖీలు చేయడం సరుకులలో తేడాలు ఉన్నాయంటూ చర్యలు తీసుకోవటం కొద్దిరోజులకే మళ్లీ కేసులు నమోదు చేస్తున్నామని చెబుతూ రేషన్ బియ్యం అక్రమ వ్యవహారాల్లో నిన్న మొన్నటి వరకు పౌరసరఫరాల అధికారులు డీలర్లు మాత్రమే కుమ్మక్కయి పాలుపంచుకున్నారు. తాజాగా ఇతర శాఖల అధికారులు కూడా సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో మండల స్థాయి రేషన్ డీలర్ల సంఘాల నాయకులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎవరెవరు వాటాలు వారికి పంపే బాధ్యతను ఆ నాయకులే తీసుకుంటున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంతే కాకుండా రాజకీయ నాయకుల మితిమీరిన జోక్యంతో అవినీతి అన్నిటికంటే మించి దళారులు ఆధిపత్యంతో పేదల కంటే పెద్దలకు ఈ వ్యవస్థ కల్పతరువుగా మారిందేమో అనిపిస్తుంది.

పేదల కడుపు కొడుతున్నారు :

ఉన్నోడిని కొట్టు పేదోడికి పెట్టు అన్నది మన టాలీవుడ్‌లో ఓ సూపర్ హిట్ సినిమాలోని ఫార్ములా కానీ ప్రస్తుతం కొంతమంది రేషన్ బియ్యం అక్రమార్కులు దీన్ని అర్థాన్ని మార్చేసి పేదవాడి కడుపు కొట్టి ఉన్నోడికి అమ్ముకో సొమ్ము చేసుకో అనే విధంగా మార్చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కిలో ఒక రూపాయి బియ్యం నియోజకవర్గంలోని అక్రమార్కులు కార్డుదారుల వద్దనే రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఓ చోట నిల్వ ఉంచి రాత్రి వేళల్లో లారీల సహాయంతో జిల్లాలు రాష్ట్రాలు దాటిస్తున్నారు. అక్కడ కొందరు అక్రమార్కులు అక్రమంగా పాలిష్ పట్టించి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని అక్రమార్కులు తమ జేబులు నింపుకుంటున్నారనీ ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ రేషన్ బియ్యం దందాను నియంత్రించడంలో ఎన్ఫోర్స్ మెంట్, రెవిన్యూ యంత్రాంగం పూర్తిగా విఫలం చెందిందని చెప్పాలి రేషన్ అక్రమార్కులతో చేతులు కలిపి గత కొంతకాలంగా పేదల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టణాలు, పల్లెటూర్లలోని కొన్ని రైస్ మిల్లులకు, అదేవిధంగా గ్రామాల్లో స్టాక్ పాయింట్లకు, తరలించి రేషన్ బియ్యాన్ని జిల్లాలో రాష్ట్రాలు దాటిస్తున్నారు. ఏ విధంగా జిల్లాలు రాష్ట్రాలు దాటించిన రేషన్ బియ్యాన్ని అక్కడ కొందరు అక్రమార్కులు పాలిష్ పట్టించి ఆకర్షణీయమైన బస్తాలలో వివిధ రకాల బ్రాండ్లతో మార్కెట్లోకి విడుదల చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకునే అక్రమ వ్యాపారులు అధికంగా ఉన్నారు. కాకా ఇది ఏమీ తెలియదని వినియోగదారులు వివిధ రకాల బ్రాండ్ కలిగిన బియ్యాన్ని కొనుగోలు చేసి మోసపోతున్నారు. నియోజకవర్గంలోని రేషన్ షాపులలో బియ్యంలో దాదాపు సగభాగం ఇలాగే సైక్లింగ్ జరుగుతున్నట్లు సమాచారం. ఇదంతా అధికారులకు తెలిసినా, అక్రమ వ్యాపారులు, మిల్లర్లు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తిపడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులకు నెలనెలా అక్రమార్కులు మామూళ్ల ముట్ట చెబుతుండడంతో, అక్రమార్కులపై, రేషన్ డీలర్ల పై చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఇకనైనా అధికారులు తగు చర్యలు తీసుకొని పేదవాడికి అందాల్సిన బియ్యాన్ని దోచుకుంటున్న అక్రమార్కులను, రేషన్ డీలర్లు పై తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు. ఇకనైనా అధికారులు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటారో… లేదో… వేచి చూడాల్సిందే..

జిల్లాస్థాయి అధికారులు చొరవ తీసుకోవాలి :

నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి స్వీకరించిన రేషన్ బియ్యాన్ని పలుచోట్ల నిల్వ ఉంచి రాత్రి వేళల్లో లారీలకు ఎత్తి జిల్లాలు, రాష్ట్రాలు దాటిస్తున్నా.. సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు పేదోడి బియ్యం అక్రమ దందాపై జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని స్పందించి అక్రమార్కులపై, అక్రమార్కులకు బియ్యాన్ని అందించే రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 71 ఫిర్యాదులు

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంగా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు మరియు పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం" నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 71 ఫిర్యాదులు వచ్చాయి. ప్రతి ఫిర్యాదుదారుతో అధికారులు ముఖాముఖీగా మాట్లాడి వారి సమస్యల సవివరాలను తెలుసుకున్నారు. అందిన ప్రతి పిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి, తక్షణ పరిష్కారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని బాధితులకు అధికారులు భరోసా ఇచ్చారు. పోలీస్ అధికారులు అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేసి, త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాధితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ప్రజలకు భరోసానిచ్చే వ్యవస్థగా, న్యాయం అందించే నిబద్ధతతో పోలీసులు వ్యవహరిస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ రమణ కుమార్, ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, దర్శి సీఐ రామారావు, కంభం సీఐ మల్లికార్జున రావు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ జగదీష్ మరియు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్ రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ

విశాలాంధ్ర - సింగరాయకొండ : ఇంటెలెక్ట్ డిజైన్ ఏరినా కార్పొరేట్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా తమ ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగరాయకొండ మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత స్కాలర్షిప్ సోమవారం పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 220 ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న బాల బాలికలకు స్కాలర్షిప్ అందిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం సింగరాయకొండ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మరియు శానంపూడి ఉన్నత పాఠశాలలోని ఎంపిక కాబడిన 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున స్కాలర్షిప్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె మహాలక్ష్మి,వీరమ్మ, దింటకుర్తి శిరీష, ఉపాధ్యాయులు సుధాకర్,పి కోటేశ్వరి పాల్గొన్నారు.

మినీ బస్సు బోల్తా

(మొదటిపేజీ తరువాయి)

అనిల్ కుమార్, మొగనవల్లి మురళి, నర్రా కుపేంద్రుడు మరియు బస్సు డ్రైవర్ కుషిని వినోద్ లు గాయాల పాలయ్యారు. సమాచారం అందుకున్న ఒంగోలు డిఎస్పి ఆర్. రాయపాటి శ్రీనివాసరావు, ఒంగోలు టూ టౌన్ సీఐ ఎం శ్రీనివాసరావు, టంగుటూరు ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు, హైవే సిబ్బంది, ఫైర్ సిబ్బంది వాళ్లందరిని కాలవలో పడ్డ బస్సు నుండి బయటకి తీసి చికిత్స నిమిత్తం ఇమిడియేట్‌గా ఒంగోలులోని రిమ్స్ హాస్పిటల్‌కి షిఫ్ట్ చేయడం జరిగింది.పోలీసు సిబ్బంది సకాలంలో స్పందించకుంటే భారీ ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు అంటున్నారు. పోలీస్ వారి సేవలకు క్షతగాత్రులు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు. ఒంగోలు డిఎస్పి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలతో వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టామన్నారు. అంతే కాకుండా ఘటనకు సంబంధించి బాధితుల కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడామన్నారు. ఎలాంటి భయాందోళన చెందాల్సిన పని లేదని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చామని ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్

పఠాన్ హనీఫ్ ఖాన్

విశాలాంధ్ర - ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల వ్యవస్థలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా పేద ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించాలన్న సదుద్దేశంతో ఆర్థిక భారాన్ని సైతం లెక్కచేయకుండా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు పఠాన్ హనీఫ్ ఖాన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక 4వ, డివిజన్ ఇస్లాంపేటలో డివిజన్ అధ్యక్షులు షేక్ అల్లాబక్షు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. హనీఫ్ ఖాన్ మాట్లాడుతూ రేషన్ కార్డులో స్థానంలో క్యూ.ఆర్. కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి పౌరసరఫరాల వ్యవస్థలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా ఇస్తుందన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో ఉపయోగకరం

విశాలాంధ్ర-మద్దిపాడు : ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డును పంపిణీ ఎంతో ఉపయోగకరమైనదని మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి అన్నారు. సోమవారం దొడ్డవరప్పాడు కీర్తి పాడు రాచవారిపాలెం గ్రామాలలో స్మార్ట్ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు ద్వారా అన్ని సంక్షేమ పథకాలు అమలు దొప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు ద్వారా అన్ని సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు వల్ల రేషన్ బియ్యం చక్కెర కందిపప్పు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంపాన్ని రమ్యకృష్ణ హేమలత అనూష, గోరంట్ల మాధవి పాల్గొన్నారు.

యువకుల మృతి బాధాకరం

(మొదటిపేజీ తరువాయి)

మండలం బీచ్ ఓడరేవు వద్ద సముద్ర స్నానానికి వెళ్లిన ఐదు మంది ప్రాణాలు కోల్పోవడం విషయం తెలిసిందేనని తెలిపారు. సోమవారం ఒక మృతదేహం దొరికిందని మిగిలిన ఒక్క మృతదేహాన్ని తీసుకురావటానికి రెవిన్యూ, అగ్నిమాపక, పోలీసు,మత్స్య శాఖల అధికారులు శ్రామిస్తున్నారని తెలిపారు.10 బొట్లు,6 డ్రన్ కెమెరాలు,10 మంది గజ ఈతగాళ్ళు,10 మంది వి.ఆర్.ఓలు ఓడరేవు వద్ద నుండి ఇటూ 4 కిలోమీటర్ల,అటు 4 కిలోమీటర్ల పరిధిలో పరిశీలించుటకు ముమ్మర తనిఖీలు చేసి సోమవారం రాత్రికల్లా మృత దేహాన్ని వెలుపలికి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాస్ నాయక్,జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి,నవీన్, తహశీల్దార్ కె.గోపి కృష్ణ,పోలీసు శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధే లక్ష్యం కావాలి:ఎంఈవో



విశాలాంధ్ర-యర్రగొండపాలెం : పాఠశాలే దేవాలయం, విద్యార్థులే దేవుళ్ళుగా, విద్యా అభివృద్ధే ప్రధాన లక్ష్యం కావాలని యర్రగొండపాలెం ఎంఇఓ. పి.ఆంజనేయులు అన్నారు. మెగా డియస్‌సి 2025 ద్వారా మండలానికి వచ్చిన 12 మంది ఎస్ జీటీలు, 35 మంది స్కూల్ అసిస్టెంటెలు మొత్తం 47 మంది ఉపాధ్యాయులకు యంఇఓ ఆంజనేయులు స్వాగతం పలికారు. నూతన ఉపాధ్యాయుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఉపాధ్యాయ వృత్తి సాధించారని అటువంటి మీరు చేరే పాఠశాలలో విద్యార్థులు, పాఠశాల ఉన్నతే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలన్నారు. క్రమ శిక్షణతో, సమయ పాలనతో పాఠశాలలకు హాజరు కావాలని, ముఖ హాజరు తప్పక వేయాలని, విద్యార్థులకు మంచి సూచనలు సలహాలతో కృత్యాధారబోధన జరుపాలని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుటకు, డ్రాప్ ఔట్స్ తగ్గించుటకు కృషిచేయాలని, గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులతో మంచి సంబంధాలు కలిగి వుండాలన్నారు. విద్యావిధానంలో వచ్చే మార్పులకనుగుణంగా విద్యాబోధన జరుపాలని, జరుగబోయే ఆన్ లైన్ తరగతులు, రిపోర్టులు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని, విద్యార్థుల మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్, యస్‌టియు సంఘనాయకులు శ్రీనివాసులు, బాబుల్ నాయక్, శామ్యూల్, వెంకటేశ్వర్లు, ఆత్మానంద ప్రభాకర్, జేమ్స్ పాల్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నర్సింగ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులుగా వనిజా రెడ్డి

విశాలాంధ్ర-పామూరు : నెల్లూరు నారాయణ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న వనజా రెడ్డి ఆదివారం జరిగిన రాష్ట్ర నర్సింగ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షురాలుగా ఎన్నికయింది. పామూరు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు చింతమ రెడ్డి వీరాంజనేయరెడ్డి సతీమణి వనజారెడ్డి నారాయణ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్‌గా చేస్తూ ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దటమే గాక ఎంతో మంది రోగులకు తమ సేవలు అందిస్తూ గుర్తింపు పొందినది. ఈ ప్రాంత ప్రజలు నారాయణ వైద్యశాలకు వైద్య నిమిత్తం వెళితే వారిని ఆప్యాయంగా పలకరించి వారికి అన్ని రకాల నాణ్యమైన వైద్యం అందించేందుకు తన వంతు సహకారం అంద చేస్తున్నారు. వనజా రెడ్డి రాష్ట్ర నర్సింగ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులుగా ఎన్నికవ్వడం పట్ల పలువురు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

700 మందికి ఉచిత వైద్యసేవలు

- డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వికసిత్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం
- కిమ్స్ హాస్పిటల్, క్విస్ ఇంజినీరింగ్ కళాశాల సహకారంతో నిర్వహణ
- ఉచితంగా మందులు పంపిణీ

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ సెల్స్ కో - కన్వీనర్, డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వికసిత భారత్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కిమ్స్ హాస్పిటల్స్, క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వారి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ సెల్స్ కో - కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి తెలియజేశారు. ప్రధాని మోడి వికసిత్ భారత్ లక్ష్యంగా ఎన్నో గొప్ప సంస్కరణలు చేపడుతున్నారని, దాంట్లో భాగంగా విద్య, వైద్యం అనే అంశాలకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని తన వంతు సాయంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సూర్య కల్యాణ్ చక్రవర్తి అన్నారు. గతంలో సర్వేరెడ్డిపాలెంలో నిర్వహించిన వైద్యశిబిరం వల్ల ఎంతోమంది చికిత్స చేయించుకున్నారని గుర్తు చేశారు. వికసిత్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో భాగంగా దాదాపు 700 మంది డ్రైవర్లు, వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు, కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాదాపు రూ.30 వేల విలువ చేసే మందులు అందించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో చూపించుకున్న ఓపీతో కిమ్స్ హాస్పిటల్ లో 50 శాతం డిస్కౌంట్ తో సంబంధిత పరీక్షలు చేస్తామని హాస్పిటల్ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో కిమ్స్ కి చెందిన డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ ఎం. వర్షిత, కిమ్స్ మేనేజర్ అమర్ నాథ్, క్యాంప్ కో - ఆర్డినేటర్ ప్రవీణ్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వాసుబాబు, ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్ పర్యవేక్షించారు.

వధూవరులను ఆశీర్వదించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి 'కోటపాటి'

విశాలాంధ్ర-పామూరు : ఏలూరు జిల్లా చింతలపూడిలో మండలపు వెంకటనారాయణ జయలక్ష్మి దంపతుల కుమార్తె మౌనిక నిశ్చయ తాంబూలాల వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్‌రావు పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. పారిశ్రామికవేత్త నాదెళ్ల తిరుపతిరావు, మండలపు సూర్యనారాయణ రావు, కోటపాటి నరసింహారావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

విశాలాంధ్ర -కంభం: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన విషాదకర సంఘటన సోమవారం చోటు చేసుకుంది. సమాచారం మేరకు మండలంలోని పోరుమామిళ్ళ పల్లికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గురువయ్య రోజువారి పనుల్లో భాగంగా పట్టణంలోని ఓభవనం పై రాడ్ బెండింగ్ పని చేస్తుండగా భవనంపై ఉన్న 11కేవీ విద్యుత్ లైనుకు తగలటంతో కార్మికుడు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కై ఒంగోల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు సమాచారం. స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గొట్లగట్టు ఉన్నత పాఠశాలలో విధుల్లోకి నూతన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఇద్దరు కొత్త ఉపాధ్యాయులు ఉద్యోగ బాధ్యతలు చేపట్టినట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు టి.ఆదినారాయణ ఒక ప్రకటనలు తెలిపారు. 2025 మెగా డీఎస్సీలో అర్హత సాధించిన వీరు గత నెల 25వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్న నక్కల ఝాన్సీ రాణి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ కసిరెడ్డి వెంగళరెడ్డి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరినట్లు పేర్కొన్నారు. వారు విధుల్లో చేరడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఝాన్సీ రాణి వెంగల్ రెడ్డిలను సీనియర్ ఉపాధ్యాయులు ఎం.వి నారాయణ, ఎస్కె మహమ్మద్ అలీ, సరోజ ఇగ్నో, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

నూతన ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-సిఎస్ పురం : మెగా (డిఎస్సి)ద్వారా ఎంపికై సి యస్ పురం మండలంలో ఈ రోజు విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులకు ఎ.పి.టీ.ఎఫ్ (ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) మండల నాయకులు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యతతో సేవ చేయాలని ఆకాంక్షించారు. నూతన ఉపాధ్యాయులు విద్యార్థులలో సృజనాత్మకత, విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు తమ సేవలతో సమాజ అభివృద్ధికి దోహదం చేయాలని నాయకులు తెలిపారు. సోమవారం మండలం లోని అంబవరం, డిజి పేట, సియస్‌పురం, శీలం వారిపల్లి, నల్లమడుగుల, కోవిలంపాడు, పెద రాజుపాలెం, నాగులవరం, గోగులపల్లి, అరివేముల మొదలగు పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు తోట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జె.ఎస్. ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్, మండల నాయకులు డి.సుబ్బరాయుడు, కె.రామ సుబ్బారావు, కె.చెన్నయ్య, జి.రామక్రిష్ణ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండలంలోని పడమట కట్ట కింద పల్లి పంచాయితీ పరిధిలోని డివిపల్లి గ్రామంలో సోమవారం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ సరఫరాలో అక్రమాలను అరికట్టేందుకు ఏర్పాటుచేసిన స్మార్ట్ రేషన్ కార్డులను కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని కేఎస్పురం, చోడవరం గ్రామం నందు నూతన రేషన్ కార్డులను టిడిపి పార్టీ మండల అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి మాజీ మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నూతన స్మార్ట్ కార్డులను అందజేయడంతో ప్రజలకు త్వరగా రేషన్ తీసుకుని సౌలభ్యం కలుగుతుందని ఎటువంటి రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా నేరుగా లబ్ధిదారుడికి అందజేయడం జరుగుతుందని ఆయన వారన్నారు ఈ కార్యక్రమంలోడీలర్ శ్రీను నాయుడు, శానం రంగారావు, సుంకరి లక్ష్మి నర్సింహా, మాధవ రావు పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై నిరసన ర్యాలీకి తరలిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ పిలుపు మేరకు సోమవారం కనిగిరిలో చేపట్టిన నకిలీ మద్యం నిరసన ర్యాలీకి వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి ఆధ్వర్యంలో నేతలు తరలి వెళ్లారు. వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు, ఎంపీపీ గంగసాని లక్ష్మి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కూడా తయారుచేసి ప్రజల ప్రాణాలని హరిస్తున్నదన్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న కల్తీ మద్యంనకు నిరసనగా కనిగిరిలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఇంటి వద్ద నుండి ఎక్సైజ్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టినట్లు ఆమె తెలిపారు. జెడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య, సీనియర్ నాయకులు గట్ల విజయ భాస్కర్ రెడ్డి, షేక్ చంద్ బాషా (బుజ్జి భాయ్), జొన్నలగడ్డ గోవిందయ్య, షేక్ నాయబ్ రసూల్, శ్రీరామ్ శ్రీనివాసులు, ముడియాల అనంత రెడ్డి, చింతంరెడ్డి బాలి రెడ్డి, కోడూరి రామ సుబ్బా రెడ్డి, షేక్ రసూల్, తాతపూడి రాము, పోతుల రమేష్, గాజుల బాబు, షేక్ రసూల్, పోతుల రమేష్, గాజులపల్లి బాబు, పాలకొండ హజరత్ రెడ్డి, షేక్ నాగూర్ బాషా, షేక్ బడే, యేలిక అచ్చయ్య, గంధం ఏలియేజర్, షేక్ కాలేషా, పాలేటి ప్రేమ్ కుమార్, యర్రబోయిన మాధవ రెడ్డి, వేముల గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం బస్సు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - తర్లుపాడు : తర్లుపాడు మండలంలోని తుమ్మచెరువు పరిసర గ్రామాల విద్యార్థిని, విద్యార్థులు తుమ్మచెరువు జడ్పీ హైస్కూల్‌కు రావాలంటే మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు నడిచి రావాల్సిన పరిస్థితి ఉందని, ముఖ్యంగా సీతనాగులవరం, సూరేపల్లి, కేతగుడిపి, బుద్దపల్లి, జగన్నాథపురం తదితర గ్రామస్తులు, విద్యార్థుల సౌకర్యం కోసం తుమ్మల చెరువు మీదుగా ఆర్టీసీ బస్సు తిప్పవలసిందిగా యంపిజే మార్కాపురం పట్టణ అధ్యక్షుడు షేక్ నాగూర్ మీరావలి సోమవారం ఆర్టీసీ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థిని, విద్యార్థులు వర్షాకాలంలో తుమ్మల చెరువు ఉన్నత పాఠశాలకు వెళ్ళలేక మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తాడివారిపల్లికు వెళ్లే బస్సును ఈ గ్రామాల మీదుగా తిప్పాలని, ఈ ప్రాంత విద్యార్థిని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే బస్సు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యంపిజే మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ రసూల్,మాజీ పట్టణ అధ్యక్షుడు షేక్ అమీర్,పట్టణ ఉపాధ్యక్షుడు సయ్యద్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

నకిలీ మద్యం..ప్రాణాలతో చెలగాటం

యర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. సోమవారం యర్రగొండపాలెం నియోజకవర్గం కేంద్రం నందు నకిలీ మద్యం తయారీకి వ్యతిరేకంగా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ భారీ ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నాయకులు నకిలీ మద్యాన్ని తయారు చేస్తూ ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో మద్యం దుకాణాల్లో యథేచ్చగా అమ్ముకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, వేలకోట్ల సొమ్ము దండుకుంటూ టీడీపీ నాయకులు అక్రమార్జనకు తెరతీశారని అన్నారు, ఎన్నికల్లో చంద్రబాబు నాన్యమైన మద్యం తక్కువ ధరకు అంటూ హామీ ఇవ్వడం అంటే అక్రమ మద్యం తయారు చేసి అమ్ముకోవడమా అని ప్రశ్నించారు, రాష్ట్రం లోని ప్రతీ పల్లెలో బెల్టు షాప్ లు వేలం జరుగుతున్న కూటమి ప్రభుత్వం చూసి చూడనట్టు ఉందని ఏద్దేవా చేశారు. ఎన్నికల ముందు నాణ్యమైన మందు అని చెప్పి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ నాయకులు నకిలీ మద్యాన్ని తయారు చేస్తూ ప్రభుత్వం ద్వారా రాష్ట్రం లో మద్యం దుకాణాల్లో ఏదేచ్చగా అమ్ముకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, వేలకోట్ల సొమ్ము దండుకుంటూ టీడీపీ నాయకులు అక్రమార్జనకు తెరతీశారని అన్నారు, ఎన్నికల్లో చంద్రబాబు నాణ్యమైన మద్యం తక్కువ ధరకు అంటూ హామీ ఇవ్వడం అంటే అక్రమ మద్యం తయారు చేసి అమ్ముకోవడమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రతీ పల్లెలో బెల్టు షాప్ లు వేలం జరుగుతున్న కూటమి ప్రభుత్వం చూసి చూడనట్టు ఉందని ఏద్దేవా చేశారు. మద్యం గుట్టు పూర్తిగా తేల్చేందుకు వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా వైన్‌షాప్‌లు, పర్మిట్‌రూమ్‌లు, బార్లు, బెల్టుషాప్‌ల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు చేసి, దీని వెనక ఎంత పెద్ద వారున్నా అరెస్టు చేయాలన్నారు. నకిలీ మద్యంపై తక్షణమే సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని, నకిలీ, కల్తీ మద్యం వల్ల చనిపోయిన వారిని గుర్తించి, వారి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.. వైన్‌షాప్‌ల కేటాయింపులో జరిగిన అక్రమాలు గుర్తించి, అనర్హులను తొలగించాలని, మద్యం షాప్‌లను మళ్లీ ప్రభుత్వమే నిర్వహించేలా చొరవ చూపాలని, మద్యం విక్రయ వేళలు కూడా తగ్గించాలని కోరారు. బడులు, గుడులు, పబ్లిక్ ప్లేస్‌ల్లో ఏర్పాటు చేసిన వైన్‌షాప్‌లు, బార్ల లైసెన్సులు రద్దు చేయమని ఎక్సైజ్ శాఖ ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కిరణ్ గౌడ్, ఒంగోలు మూర్తి రెడ్డి, యర్రగొండపాలెం సర్పంచ్ అరుణాబాయి, జబీవుల్లా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మంగినపూడి శివాలయంలో చోరీ

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలోని మంగినపూడి శివాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. తెలిసిన వివరాల మేరకు.. శివాలయం గేటు తాళం పగులకొట్టి కానుకల హుండీని ఎత్తుకెళ్ళి సమీపంలోని చెరువులో పడేసి దానిలోని నగదును దోచుకున్నారు. శివాలయం ఎదురుగా ఉన్న బడ్డీ కొట్టు తాళం పగుల కొట్టి అందులోని పెట్రోలు, సిగరెట్లు, డ్రింక్స్, చిల్లర ఎత్తుకెళ్ళారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసు సిబ్బంది చోరీ జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వెంకట రామాంజనేయులు సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలోని పోలేపల్లి (ఎస్సీ) ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా బివి రామాంజనేయులు చేసిన సేవలు ఎనలేనివంటూ ప్రధానోపాధ్యాయులు ఆదిమూలపు ప్రభుదాసు తెలిపారు. ఐదేళ్ళ పాటు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించిన రామాంజనేయులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. మరెందరికో విద్యను అందించేలా విశిష్ట సేవలందించాలని ఆకాంక్షిస్తున్నట్లు ప్రభుదాసు తెలిపారు. కార్యక్రమంలో ఆదిమూలపు ప్రభుదాసు, బి.వి.రామాంజనేయులు, పావని, సీఆర్‌పీ దేవమణి, పాఠశాల ఛైర్మన్ రమేష్, తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థులున్నారు.

జీవన ఎరువులపై అవగాహన

విశాలాంధ్ర-ముండ్లమూరు : రైతులకు జీవన ఎరువులు వాటి ప్రాముఖ్యత గురించి దర్శి కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ వివరించారు. స్థానిక రైతు సేవ కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించి, స్థానిక మండల కార్యాలయం వద్ద సోమవారం జీవన ఎరువులపై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవన ఎరువులు వాటి ప్రాముఖ్యత గురించి దాని ఉపయోగాల గురించి వివరించారు. కెవికే శాస్త్రవేత్త వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రస్తుత పంటలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు మాట్లాడుతూ రైతులు తాము వేసిన ప్రతి పంటను ఈ -పంటలో నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు 25వ తేదీ లోపల చేయించుకోవాలన్నారు. ఏఈఓ వేమూరి శ్రీ కీర్తి రావు, వీపిఏ కే.వీరాంజనేయులు, బాపట్ల వ్యవసాయ కళాశాల ర్యాప్ విద్యార్థులు పి.భరత్, షేక్ బాజీ, అర్జున్ పట్టాభిరామ్, అప్రమేయ, అనుపమ్ రాయ్, రైతులు పాల్గొన్నారు.

ప్రజా విజ్ఞప్తులకు రెండు అర్జీలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. అందులో పొలానికి దారి చూపించాలని, పొలాన్ని ఆన్లైన్ చేయాలని అర్జీలు అందినట్లు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సుజాత పాల్గొన్నారు.

బస్సుల కొరత ... ప్రయాణికుల ఇబ్బందులు

కొమురోలు-బేస్తవారిపేట, మార్కాపురం రహదారిలో ఇబ్బందులు

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు నుంచి బేస్తవారిపేట, మార్కాపురం వైపు వెళ్లే మార్గాల్లో సరైన బస్సు సదుపాయాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సులు అందుబాటులో లేక ప్రజలు గంటల తరబడి బస్టాండ్లలో వేచిచూడాల్సి వస్తోంది. ఇక కడప నుంచి శ్రీశైలం వెళ్తున్న బస్సుల్లో కూడా ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో గాలి వెంటిలేషన్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సోమవారం కడప-శ్రీశైలం బస్సులో జనాభా అధికంగా ఉండటంతో మరికొందరు ప్రయాణికులను ఎక్కించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ మార్గాల్లో అదనపు బస్సులు నడపాలని, ఫ్యాన్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని ఏపీఎస్ఆర్టీసీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి : ఎంఈఓ

విశాలాంధ్ర-ముండ్లమూరు : నూతనంగా ఉపాధ్యాయ విధుల్లో చేరిన ఉపాధ్యాయులు..విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ ఎస్కే కాలేశావలి అన్నారు. 2025 మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ చేతుల మీదుగా ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్ ఇచ్చారు. ఎంఈఓ మాట్లాడుతూ నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభ పద్ధతిలో విద్యను బోధించాలన్నారు. మండలంలో ఉల్లగల్లు -3, సింగనపాలెం-1, సుంకర వారి పాలెం-2, కెల్లంపల్లి-1, ముండ్లమూరు-2, ఈదర-2, పూరి మెట్ల-3, వేములు-2, ఉమామహేశ్వరపురం-1, మారెళ్ళ-3, మొత్తం 20 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. వీరిని ఎంఈఓ, తోటి ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పనిదం శ్రీనివాసరావు, ఎస్కే మస్తాన్వలి పాల్గొన్నారు.

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యక్తిత్వ వికాస ఉత్తమ శిక్షకుడిగా ఎం.రవిచంద్ర కుమార్ ఎంపిక

విశాలాంధ్ర-మార్కాపురం: ఉత్తమ 'ఇంపాక్ట్ ఇంటర్నేషనల్' ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్‌గా మార్కాపురంకు చెందిన బాలికల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.రవి చంద్ర కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 12వ తేదీ ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడలోని 'హోటల్ క్షత్రియలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ట్రైన్ ది ట్రైనర్ (వ్యక్తిత్వ వికాస శిక్షణ) వర్క్ షాప్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ హెడ్ బోర్డ్ మెంబర్ ఆదినారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. సైకాలజిస్ట్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై 30 రోజుల వ్యక్తిత్వ వికాస శిక్షణకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి 120 మంది హాజరు కావడం అభినందనీయమని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మీరంతా "నవభారత నిర్మాణానికి రాళ్లెత్తే కూలీలుగా మారాలని" పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యార్థుల్లో ఉన్నటువంటి నిరాశ, నిస్పృహ, అభద్రతాభావాలను పోగొట్టే విధంగా వారిలో వ్యక్తిత్వ వికాస పెంపుదలకు కృషి చేయాలని, టైం మేనేజ్మెంట్, గోల్ సెట్టింగ్, కెరీర్ గైడెన్స్, యాంటీ టొబాకో, యాంటీ డ్రగ్స్, పరీక్షలను ఎలా ఎదుర్కోవాలి, సోషల్ మీడియా అవేర్నెస్, చదువు పట్ల ఆసక్తిగా ఉండడం, మరియు హాబిట్ ఫార్మేషన్ వంటి అంశాలపై తరగతులు నిర్వహించాలని సూచించారు. అలాగే వారిలో ఆత్మస్థైర్యాన్ని, నవ చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపే విధంగా మీ ఉపన్యాసాలు, శిక్షణ ఉండాలని అభిలషించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారంతా ఇకపై ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ విద్యా సంస్థలు మరియు కార్యాలయాల్లో వ్యక్తిత్వ వికాస శిక్షణ మరియు మోటివేషనల్ స్పీచెస్ ఇవ్వడానికి అర్హత సాధించారని, శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన రవిచంద్ర కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

తదుపరి ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ హెడ్ బోర్డ్ మెంబర్ ఆదినారాయణ రెడ్డి, నేషనల్ బోర్డ్ అధ్యక్షులు మాధవి, ఉపాధ్యక్షులు రాజేశ్వరి, రీజనల్ అధ్యక్షులు చక్రవర్తి, సెక్రటరీ సుబ్బారావు తదితరులు రవి చంద్రను ఉత్తమ ప్రతిభ అవార్డు, బ్యాడ్జి మరియు సర్టిఫికెట్‌లతో సత్కరించి అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి మౌలిక వసతుల కల్పన

విశాలాంధ్ర - సంతమాగులూరు : కామేపల్లి లోని బీసీ అంగన్‌వాడీ కేంద్రానికి దాతలు మౌలిక సదుపాయాలు కల్పించారు.గ్రామానికి చెందిన నేలపాటి అంజమ్మ తన భర్త లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం సొంత నిధులతో కుర్చీలు,బల్లలు,ఇనుప ర్యాకులను సమకూర్చారు.సోమవారం గ్రామ వైస్ ప్రెసిడెంట్ గమిడి వెంకట్రావు,ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీఓ డి.సుధా,సూపర్ వైజర్ సుష్మారాణి సమక్షంలో ఆ సామగ్రిని అంగన్వాడీ సెంటర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా దాత అంజమ్మను సీడీపీఓ,అంగన్వాడీ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీలక్ష్మి,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బేటీ బచావో..బేటీ పడావోపై అవగాహన

ఆడ పిల్లలను బాగా చదివించాలని పదవ తరగతితో వారి చదువు ఆపకుండా,ఉన్నత చదువులు చదివించాలని సీడీపీఓ సుధా తల్లిదండ్రులకు సూచించారు.ప్రభుత్వం బాలికల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగ పరచుకోవాలని చెప్పారు.బాలికల విద్య వలన దేశం పురోగతిని సాధిస్తుందన్నారు. అంతేకాకుండా ఆడపిల్లలు పుట్టిన తల్లిదండ్రులకు ఆడపిల్ల పేరున సుకన్య సమృద్ధి యోజన పథకం కింద వారికి సమీపంలో ఉన్న బ్యాంకు, పోస్టాఫీసులో ఖాతాను ప్రారంభించి, ఏడాదికి రూ.లక్ష యాభై వేల వరకు జమ చేయ వచ్చన్నారు. ఈ పొదుపు చేసిన సొమ్మును బాలిక 18 ఏళ్ల వయస్సు నిండిన తర్వాత ఉన్నత విద్య,పెళ్లి వంటి అవసరాల కోసం తీసుకోవచ్చన్నారు. అదేవిధంగా సుకన్య సమృద్ధి యోజనలు వడ్డీ శాతం కూడా ఎక్కువగానే ఉంటుందని తెలియజేశారు.బాలికలకు సమతుల పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత తల్లికి ఉందన్నారు.లేకపోతే వారిలో పోషణలోపం, రక్తహీనత వంటి సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి: ఆర్డీవో

విశాలాంధ్ర - రేపల్లె : అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో ఎన్.రామలక్ష్మి అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్,అధికారి ఎన్.రామలక్ష్మి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.మొత్తం ఐదు అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.సాంబశివరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్,ఇరిగేషన్,విద్యుత్, ఆర్అండ్‌బి,అగ్రికల్చరల్,ఫిషరీస్ శాఖల నుండి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : పి.ఆర్.సి ప్రభుత్వ ఐటిఐ గూడవల్లిలో 2025-26 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల కొరకు 5వ దఫా ప్రవేశానికి రెండు సంవత్సరాల కోర్సులు ఎలక్ట్రికల్,ఫిట్టర్, మోటార్ మెకానిక్,డ్రాఫ్ట్ మాన్ సివిల్,ఒక సంవత్సరం కోర్సు మెకానిక్ డీజిల్ సీట్ల కొరకు దరఖాస్తులను ఐటిఐ.ఏపీ.జీఓవి.ఐఎన్.వెబ్ సైట్‌లో ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్యాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.దరఖాస్తులు 13వ తేదీ నుండి 16 వ తేదీ వరకు సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 7702400570,9398650408,9491185900 నంబర్లను సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 29వ తేదీన ఉదయం 10 గంటలకు కళాశాలలో అడ్మిషన్లు నిర్వహించబడతాయన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన ఎర్రబోయిన నాగేశ్వరరావు మతిస్థిమితం సరిగ్గా లేక ఇంటి నుంచి వెళ్లిపోయారని భార్య వీరమ్మ సంతమాగులూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఈనెల 4వ తేదీన మధ్యాహ్నం 3గంటల నుంచి నాగేశ్వరరావు (50) కనిపించడం లేదని అందులో పేర్కొన్నారు.చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువులను విచారించిన ఫలితం లేకపోయిందని వాపోయారు.ఎవరైనా నాగేశ్వరరావును గుర్తించితే 9121102168 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

కోర్టు ఆవరణలోకి వర్షపు నీరు

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.తాలూకా ప్రాంగణంలోని క్రిమినల్ కోర్టు ప్రాంగణంలో వర్షపు నీరు చేరి కక్షిదారులు,న్యాయవాదులు కోర్టు ఉద్యోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోర్టు అవరణం పల్లంగా ఉండడంతో కురిసిన వర్షం నీరు చేరడంతో వరండాలోని బెంచీలు కూర్చోవడానికి వీలు లేకుండా వర్షపు నీరు చేరింది. పట్టణంలోని కొన్ని కాలనీలలో వర్షం నీటితో నిండిపోయి ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని వీధుల్లో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నా యి.లోతట్టు ప్రాంతాలు వర్షపు వీటితో నిండి ఉన్నాయి.పలు కాలనీలో వర్షపు నీరు రావడంతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు.

రహదారి విస్తరణ పనులకు నిధులు విడుదలపై హర్షం

విశాలాంధ్ర - రేపల్లె : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రేపల్లె మండలం రేపల్లె-తుమ్మల-గంగడిపాలెం వరకు 28 కిలోమీటర్ల సింగిల్ లైన్ రహదారి డబుల్ లైన్ రహదారిగా విస్తరింపజేస్తూ కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.49 కోట్ల రూపాయలు మంజూరు చేయించారు.ఈ సందర్భంగా మండలంలోని అరవపల్లి గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ చిత్రపటాలకు గ్రామస్తులు, టిడిపి నాయకులు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదని నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఎన్నికల హామీలు భాగంగా మంత్రి సత్యప్రసాద్ రహదారులు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వేపూరి శ్రీనివాసరావు, మల్లికార్జున రావు, బొందలపాటి భూపతి,కొండలు,పూర్ణచంద్రరావు, మాణిక్యరావు, వెంకటరావు,ఎన్.గౌరీ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యాన్ని అరికట్టాలి

విశాలాంధ్ర - అద్దంకి : రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టాలని అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చింతలపూడి అశోక్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నకిలీ మద్యం దందాపై సోమవారం అద్దంకిలో వైసీపీ శ్రేణులు నిరసన ర్యాలీ నిర్వహించారు.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఖాళీ మద్యం సీసాలతో బంగ్లా రోడ్డు నుండి ఎక్సైజ్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని ఎక్సైజ్ ఇంచార్జి సిఐ హర్షవర్ధన్ రెడ్డికి సమర్పించారు.నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు,కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు

పర్చూరులో....

విశాలాంధ్ర - పర్చూరు : వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పర్చూరు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త,రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని,నకిలీ మద్యం దందాపై సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు వైసీపీ నాయకులు,కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ ఆఫీస్ ఎదురు నిరసన తెలియచేసి ఎక్సైజ్ సిఐ భుజంగరావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం పార్టీ నాయకులు అందజేయడం జరిగింది.కార్యక్రమంలో మండల కన్వీనర్లు, మాజీ మండల కన్వీనర్లు,ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులు,వివిధ హోదాలలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు,పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుందుర్రులో పట్టపగలే చోరీ



విశాలాంధ్ర - సంతమాగులూరు : గుర్తు తెలియని దుండగులు తాళం వేసిన ఇంట్లో చొరబడి బీరువా పగలగొట్టి నగదు, బంగారం,వెండి ఆభరణాలు దొంగిలించుకెళ్లిన సంఘటన కుందుర్రులో చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం ఈనెల 12న ఉదయం 9 నుంచి 11.40 గంటల సమయంలో కుందుర్రు గ్రామానికి చెందిన ఎస్కే కాశింసైదా తన ఇంట్లో కొందరు దొంగలు తాళాలు తీసి లోపలికి చొరబడ్డారు.బీరువాను పెకలించి,అందులో ఉన్న రూ.20వేల నగదు,ఒక సవరు బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి వస్తువులను తస్కరించు కెళ్లారు. వాటి విలువ రూ. 70వేల వరకు ఉంటుందని బాధితులు పోలీసులకు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి: తహసీల్దార్

విశాలాంధ్ర - యద్దనపూడి : విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తహసీల్దార్ కే.రవికుమార్ అన్నారు.యద్దనపూడి గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని,ఒక కుటుంబంలో బాలిక విద్యావంతురాలు అయితే ఆ కుటుంబానికి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని,విద్యతో పాటు ఆటలలో కూడా రాణించాల న్నారు.విజేతలకు బహుమతి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్ గోపి,పాఠశాల ప్రిన్సిపాల్ జె.రాజ్యలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్ సుజాత,పాఠశాల ఉపాధ్యాయులు యద్దనపూడి ,యనమదల గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మా ఊరికి బస్సు వేయండి...

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మా ఊరికి బస్సు వేయండి అంటూ కర్లపాలెం మండలంలోని గణపవరం, చిన్నపులుగువారిపాలెం, పెదపులువారిపాలెం, కేశవపురి,కట్టవాద గ్రామాలకు చెందిన మహిళలు సోమవారం బాపట్ల ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు.బాపట్ల నుంచి పెదపులువారిపాలెం వరకు గతంలో బస్సు ఉండేదని మరల పునరుద్ధరించాలని చేయాలని కోరారు.

ఎస్సీ,ఎస్టీల ఐక్యమత్యాన్ని పెంపొందించేందుకు పరిరక్షణ సంఘం కృషి

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లెలో అంబేద్కర్ భవనంలో ఆలిండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి నేషనల్ సెక్రెటరీ అందే శ్యామ్ అధ్యక్షత వహించారు.రాష్ట్ర నాయకులు సుబ్బారావ్,చెరుకూరి లక్ష్మణ్,దాసరి వెంకటేశ్వరరావు,గుంటూరు జిల్లా అధ్యక్షులు రమేశ్ బాబు హాజరయ్యారు.అందే శ్యామ్ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో దండమూడి సుధీర్,బాపట్ల జిల్లా అధ్యక్షులుగా,చందోలు సురేష్,జనరల్ సెక్రెటరీగా,వాగోలు రమేష్,వైస్ ప్రెసిడెంట్‌గా నియమించారు. సందర్భంగా అందే శ్యామ్ మాట్లాడుతూ సంఘం యొక్క ఆశయాలు ఎస్సీ,ఎస్టీల సభ్యులలో సహకారంతో ఐక్యమత్యాన్ని పెంచుతూ, విద్యార్థుల అభివృద్ధికై కృషి చేయటం, విద్యార్థుల బాగోగులకై శారీరక, సాంఘిక సాంస్కృతిక కార్యక్రమాలను పెంపొందించుట, అత్యాచారాలు అన్యాయాలను అరికట్టుట,బాబాసాహెబ్ డాక్టర్. బిఆర్.అంబేద్కర్ యొక్క ఆశయాలను, సిద్ధాంతాలను వ్యాపింపచేయుట అనే అంశాలను వివరించారు.ఇదే సందర్భంగా సుప్రీంకోర్టులో సి.జె.ఐ చీఫ్ జస్టీస్ గవాయిపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు.

బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన

విశాలాంధ్ర - చీరాల రూరల్ : యార్లగడ్డ అన్నపూర్ణాంబ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత సెల్,రోటరీ క్లబ్ ఆఫ్ చీరాలల సంయుక్త ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై డాక్టర్ బాబూరావు సారథ్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జివిఆర్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ ఆప్మా మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలని, ఒకటి,రెండు స్టేజ్‌లలో క్యాన్సర్ వుంటే కీమోథెరపీ, రేడియోథెరపీల ద్వారా రోగిని బ్రతికించే అవకాశం ఉన్నదన్నారు.బయట ఆహారం తినకుండా,మంచి పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. వలివేటి మురళీకృష్ణ,పోలుదాసు రామకృష్ణ, ప్రిన్సిపాల్ జి.రత్నప్రభ,డాక్టర్ అంకమ్మ,భానుకుమారి, సుభాషిణి, లలితకుమారి,జివై ప్రసాద్,గుద్దంటి రమేష్,స్వామి,శివాంజనేయ ప్రసాద్, కుమారస్వామి,అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ,ఉప సర్పంచులకు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : మారుతున్న కాలాలకు అనుగుణంగా గ్రామాలు కూడా మార్పు చెందాల్సిన ఆవశ్యకత ఉందని మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభాని అన్నారు.సోమవారం ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలకు ఆరోగ్యవంతమైన విధానం అవలంభించేందుకు కొన్ని సూచనలను ప్రతిపాదించిందన్నారు.వాటిని క్రోడీకరించి 9 విభాగాలుగా విభజించి ఆయా దేశాలలో వాటిని కచ్చితంగా అమలు చేయాల్సిందిగా ఆదేశాలు జారీచేసిందన్నారు.దీనిలో భాగంగా ఐదో భాగమైన శుభ్రత,పరిశుభ్రత అనే అంశంపై గ్రామాలలోని సర్పంచ్లు ,ఉప సర్పంచ్లు కార్యదర్శులకు మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 16 పంచాయతీల సర్పంచ్లు,ఉపసర్పంచ్‌లు,కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలన్నారు.

ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తాం

- ఎక్సైజ్ శాఖ సీఐ గీతిక

విశాలాంధ్ర - కర్లపాలెం : దేవాలయం ముందు మద్యం దుకాణం ఏర్పాటుపై ఆగ్రహం అంటూ విశాలాంధ్రలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ శాఖ గీతిక స్పందించారు.మద్యం షాపు ఇతర ప్రాంతానికి తరలింపుపై మాకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి

వెల్లలచెరువులో పోషణ్ మహోత్సవాలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : వెల్లలచెరువు ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీఓ డి.సుధా అధ్యక్షతన సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ మూడేళ్ల వయస్సు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లులకు సూచించారు.చక్కని ప్లే మెటీరియల్‌తో అంగన్వాడీ కేంద్రాలు ఆకర్షణీయంగా రూపొందించినట్లు పేర్కొన్నారు.వెలలచెరువు ఎస్సీ-1 కేంద్రంలో పిల్లల ప్రీ స్కూల్ అభ్యసన కొరకు టీవీ,తాగునీరు ప్యూరిఫైయర్,ప్లే మెటీరియల్ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే అంగన్‌వాడీ ఉపాధ్యాయుల పిల్లల కొరకు టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) రూపొందించుకొని రోజు వారీ కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. పిల్లల్లో శారీరక,మానసిక,భావోద్వేగ,సాంఘిక అవసరాలను బట్టి ఈ ప్లే మెటీరియల్‌ని తయారు చేసినట్టు తెలిపారు.ప్రతినెలా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు,బరువులు కొలిచి వారి ఎదుగుదలను అంచనా వేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులందరూ కూడా వారి పిల్లల ఎదుగుదలను గమనించాలన్నారు.ఏఎన్ఎం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లలందరినీ బాగా చదివించాలని,బాల్య వివాహాలు చేయకూడదని,తద్వారా వచ్చే శారీరక,మానసికంగా అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతుందని తల్లిదండ్రులకు తెలియజేశారు. ముఖ్యంగా రక్తహీనత,ప్రమాదకరమైన శిశు జననం,తక్కువ బరువుతో శిశు జననం,మాతా శిశు మరణాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని ఆమె తెలియజేశారు.అనంతరం అంగన్వాడీ కేంద్రంలో బాల్య విద్యారంభ విద్యకి సంబంధించి మెటీరియల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.అలాగే వెల్ బేబీ షో పోటీలను నిర్వహించి, విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎం. సుష్మారాణి,స్కూల్ హెచ్ఎం ఎన్. వెంకట్రావు, మహిళా పోలీస్ శారదాబాయి,అంగన్‌వాడీ టీచర్లు విజయమ్మ,,జయసుధ,తులసి,బాజీ పాల్గొన్నారు.

కల్తీ మద్యం మాఫియా దోషులను శిక్షించాలి

వేమూరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు

విశాలాంధ్ర - వేమూరు : టిడిపి నేతల కనుసనల్లోనే కల్తీ మద్యం మాఫియా జరుగుతుందని,కల్తీ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గ ఇన్చార్జ్ వరికూటి అశోక్ బాబు డిమాండ్ చేశారు.సోమవారం నియోజకవర్గ కేంద్రం వేమూరులో కల్తీ మద్యాన్ని అరికట్టాలంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అశోక్ బాబు నేతృత్వంలో వైసీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమినేతల నేతృత్వంలోనే కల్తీ మద్యం విచ్చలవిడిగా సరఫరా అవుతుందన్నారు.కల్తీ మద్యం తాగి అనేకమంది పేదవారు అనారోగ్యం పాలవటమే కాకుండా మృతి చెందుతున్నారని మృతుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.కల్తీ మద్యం కేసులో దోషులను శిక్షించాలని,కల్తీ మద్యం కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక తన పార్టీ నాయకులకు మద్యం షాపులు అప్పగించి,వారి లాభాల కోసం కల్తీ మద్యాన్ని విక్రమించే విధంగా ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు కోగంటి లవకుమార్,పెరికల పద్మారావు,గాదె శివరామ కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బొల్లి ముంత ఏడుకొండలు గోపాలం రాము,దున్న మెరిస్ బాబు,మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు గాజుల భాను ప్రకాష్ కూచిపూడి మోషే,శివ పార్వతి పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలును నడిపితే కఠిన శిక్ష

విశాలాంధ్ర - చెరుకుపల్లి : వాహన చోదకులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే మారిన ట్రాఫిక్ రూల్స్ ప్రకారం భారీ జరిమానా విధించడం జరుగుతుందని ఎస్సై టి.అనిల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఐలాండ్ సెంటర్ వద్ద ద్విచక్ర వాహన దారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై కొందరు ఇష్టాను రీతిన తిరుగుతున్నారని అలాంటివారు ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఎక్కువ అన్నారు.చెన్నై నుండి విశాఖపట్నం వరకు వెళ్లే వాహనాలు వేగంగా వచ్చే ఈ దారిలో ప్రజలు జాగ్రత్తగా ప్రయాణం చేయవలసి ఉంటుందన్నారు.కొందరు ఇంటర్మీడియట్ కూడా పూర్తి దాని విద్యార్థులకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్లపై పంపిస్తున్నారని అట్టివారు భారీ మూల్యం చెల్లించక తప్పదన్నారు.కొంతమంది తమ ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు ప్రయాణిస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారని అలా ప్రయాణించటం నేరమన్నారు.సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు అడుగుతున్న వారిపై జరిమానా విధించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 4వ విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన ట్రేడులలో ఉన్న ఖాళీలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమామహేశ్వరిదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ లోపు iti.ap.gov.in ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ : 8074516183కు లేదా నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

కల్తీ మద్యాన్ని అరికట్టండి

విశాలాంధ్ర - రేపల్లె : విచ్చలవిడిగా రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తుందని రేపల్లె నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ ఈవురి గణేష్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కల్తీ మద్యంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రేపల్లె నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ ఈవురి గణేష్ నాయకత్వంలో సోమవారం నగరం ప్రొహిబిషనల్ అండ్ ఎక్సైజ్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులకు కల్తీ మద్యం అరికట్టాలని మెమొరాండం అందజేయటం జరిగినది.ఈ కార్యక్రమంలో రేపల్లె వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కరేటి శేషగిరిరావు,స్టేట్ సెక్రటరీ మదన్,జాయింట్ సెక్రెటరీ చిమట బాలాజీ, చిత్రాలఓబేదు,రామకృష్ణరాంబాబు,అనిల్, కృష్ణారెడ్డి, ఉమారాణి,గోపి శివ,నరేంద్ర,కొండల్ రెడ్డి,కోటేశ్వరరావు,కుర్దుస్,గౌస్,ఖాదర్ తదితర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీ మద్యాన్ని అరికట్టాలి

మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

విశాలాంధ్ర-సి ఎస్ పురం : నకిలీ మద్యం తయారీని ఒక కుటీర పరిశ్రమలా మార్చి, రాష్ట్రమంతా సరఫరా చేస్తూ, అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు కూటమిప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. సోమవారం మద్యం విధానాలకు వ్యతిరేకంగా విశాఖపట్నం జిల్లాలోని గాజువాక, విశాఖ వెస్ట్ నియోజకవర్గాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరు బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గాజువాక , విశాఖ వెస్ట్ సమన్వయకర్తలు దేవన్ రెడ్డి, మల్లా విజయ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిగా మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కదిరి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైయస్సార్‌సీపీ నకిలీ మద్యం పై రాష్ట్ర వ్యాప్తంగా పోరుబాట కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కల్తీ మద్యం వల్ల రాష్ట్రంలో 421 మంది చనిపోయారని తెలిపారు. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా వైన్‌షాపులు, పర్మిట్‌రూమ్‌లు, బార్లు, బెల్టుషాపుల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు చేసి, దీని వెనక ఎంత పెద్ద వారున్నా అరెస్టు చేయాలని నకిలీ మద్యంపై తక్షణమే సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని నకిలీ కల్తీ మద్యం వల్ల చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైన్‌షాపుల కేటాయింపులో జరిగిన అక్రమాలు గుర్తించి, అనర్హులను తొలగించాలని మద్యం షాపులను మళ్లీ ప్రభుత్వమే నిర్వహించేలా చొరవ చూపాలని, మద్యం విక్రయ వేళలు కూడా తగ్గించాలని బదులు, గుడులు, పబ్లిక్ ప్లేస్‌ల్లో ఏర్పాటు చేసిన వైన్‌షాపులు, బార్ల లైసెన్సులు రద్దు చేయాలని కదిరి బాబురావు డిమాండ్ చేశారు.జగన్మోహన్ రెడ్డి హయంలో కల్తీ మద్యం అనేది లేకుండా స్వచ్చమైన మద్యం ప్రభుత్వమే సరఫరా చేసి బెల్టు షాపులు లేకుండా చేశారని అన్నారు. అనంతరం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు స్థానిక నాయకులతో కలిసి కదిరి బాబురావు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్ ,కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, ఇన్చార్జిలు,నాయకులు కార్యకర్తలు,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

విశాలాంధ్ర-సిఎస్పురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాలు ప్రకారం బైకు నడుపుతున్న సిఎస్పురం మండలం కృష్ణనాయనిపల్లికి చెందిన కాటసాని రవి, నేషనల్ హైవే రోడ్డు మీద అడ్డుగా వచ్చిన మతిస్థి మితం లేని గుర్తు తెలియని వ్యక్తి ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాద సంఘటనను తెలుసుకున్న పోలీసులు చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

విధుల్లోకి నూతన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా కొత్తగా ఉపాధ్యాయులు ఎంపిక పూర్తయింది. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు మేరకు పామూరు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏడు మంది ఉపాధ్యాయులు విధులలోకి చేరారు. అనంతరం పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గుత్తి కొండలరావు ఉపాధ్యాయులను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కోటిరెడ్డి, ఎంఈఓ కరుణ కుమారి, నూతన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తగ్గించిన జీఎస్టీపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలో ఎంపీడీఓ డి ఈశ్వరమ్మ తహసీల్దార్ సురేష్ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు తగ్గించిన జీఎస్టీ పై మోటార్ సైకిల్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వివిధ రకాల వస్తువులపై తగ్గించిన జీఎస్టీ గురించి గ్రామస్తులకు, షాపుల యజమానులకు అవగాహన కల్పించారు. తగ్గించింది జీఎస్టీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో బుల్లెన్నరావు అధికారులు ఎంపీడీవో,తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ఎంఈఓ మస్తాన్ నాయక్

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పాఠశాల విధులలో నూతనంగా చేరబోతున్న ఉపాధ్యాయులకు ఎంఈఓ బి మస్తాన్ నాయక్ సోమవారం నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగం వృత్తి కాదని, నవ సమాజాన్ని తయారు చేసే బాధ్యత మీ మీద ఉందని ,అమ గుర్తు చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలని, మండలానికి మంచి పేరు తీసుకొని రావాలని తెలియజేశారు. తదనంతరం ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో చేరిన 12 మంది ఉపాధ్యాయిని ఉపాధ్యా యులకు నియామక పత్రాలు అందజేశారు. ముద్దు నాగేశ్వరరావు , బి రామకృష్ణ నాయక్ , మందగిరి వర్ధన్లు పాల్గొన్నారు.

పత్తి పంట దిగుమతి సుంకాలు పెంచాలి

ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర - బేస్తవారిపేట : కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ప్రత్తి పంట దిగుమతి సుంకాలను తిరిగి 50శాతం పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి ధాకాల పుల్లయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్తి రైతుల సమస్యలను పరిష్క రించాలని కోరుతూ మండలంలోని మోక్ష గుండం గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రత్తి రైతుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న ఎర్రకోట పైనుండి ప్రధానమంత్రి ప్రసంగిస్తూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు కల్పించి ఆదుకుంటానని చెప్పిన మూడు రోజులకే ప్రత్తి పంట దిగుమతి సుంకాలను తగ్గించి రైతులకు తీరని ద్రోహం చేశారని ఆయన విమర్శించారు. ప్రత్తి పంట దిగుమతి సుంకం పెంచడంతోపాటు యంఎస్ పి పత్తి ధర క్వింటా రూ. 10,075లు ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ సీ2+50శాతం ఫార్ములాను అమలుపరచాలని, 2014 సంవత్సరం నుంచి ఆత్మహత్య చేసుకున్న ప్రతి రైతు కుటుంబానికి రూ. 25 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యదర్శి రమేష్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గిద్దలూరు నియోజకవర్గ సహయ కార్యదర్శి ఉరుమార్పు జోషఫ్, మోక్షగుండం శాఖా కార్యదర్శి ఎంవీ కొండయ్య, రైతులు పాల్గొన్నారు.

26 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరిక

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని పల పాఠశాలలో 26మంది కొత్త ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరినట్లు ఎంఈఓ 2 బిరిగే నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మెగా డీఎస్సీలో ఎంపికై గత నెల 25న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు తీసుకొని ఉన్నారు. మండలంలోని చిన్నారి కట్ల ఉన్నత పాఠశాలకు ఒకరు గొట్లగట్టు ఉన్నత పాఠశాలకు ఇద్దరు మర్రిపాలెం ఉన్నత పాఠశాలకు ముగ్గురు రేగడిపల్లి ఉన్నత పాఠశాలకు, ముగ్గురు కొనకనమిట్ల ఉన్నత పాఠశాలకు, ఇద్దరు ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో 15 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారని ఎంఈఓ 2 పేర్కొన్నారు.

చోద్యం చూస్తూన్న ప్రభుత్వం

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- బెల్ట్ షాపులను మూసి వేయాలి
- అన్నా రాంబాబు డిమాండ్

విశాలాంధ్ర-మార్కాపురం : రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతుందని, ఇంత జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చూస్తోందని నియోజక వర్గ వైసిపి ఇంచార్జి,మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాలక వర్గ తీరును తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అరికట్టాలని కోరుతూ వైసిపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ పేద ప్రజల సమస్యలను పరిష్క రించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు మద్యాన్ని అందులోనూ కల్తీ మద్యాన్ని అందించ డంలో ఘనవిజయం సాధించిందని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతుందని, ఇంత జరుగుతున్న అందుకు బాధ్యులైన వారిని పట్టించుకోకుండా అధికారులు చోద్యం చూస్తు న్నారని విమర్శించారు. కల్తీ మద్యాన్ని అరి కట్టాలని, మద్యం బెల్టు షాపులను తొలగించాలని కోరుతూ నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐ ముక్కు శ్రీనివాస్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి కూడా వైసిపి నాయకులు పై సమస్యలతో కూడిన ప్రతి పత్రాన్ని సమర్పించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు ఎస్ కె. సలీం, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోలమారి శ్రీనివా సరెడ్డి, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు గొట్టం నర్సమ్మ, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మండలంలోని చిన్న గుడిపాడు గ్రామంలో టిడిపి నాయకుడు దొడ్డ శేషాద్రి, మరియు వీఆర్వో నాగేశ్వరరావు సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ సరఫరాలో అక్రమాలను అరికట్టేందుకు ఏర్పాటుచేసిన స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వ ప్రవేశపెట్టిందని తెలియజేశారు. అనంతరం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I, PICHALA PADMA (Old Name), W/o. ANNAPUREDDY CHENNA REDDY, Resident of Door No:03-97, Marlapalem, PO: Darsi, Devavaram, Prakasam District - 523247, Andhra Pradesh. I have changed my surname as ANNAPUREDDY PADMA (New Name) W/o. ANNAPUREDDY CHENNA REDDY. Hereafter my surname is known as ANNAPUREDDY PADMA (New Name) W/o. ANNAPUREDDY CHENNA REDDY.

అర్జీలను శాశ్వత పరిష్కారం చూపాలి

- ఎస్పీ బి.ఉమామహేశ్వర్

విశాలాంధ్ర - బాపట్ల : అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు.తమ సమస్యలను వెల్లబుచ్చుకోవడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని,వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు.సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు.వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు.వారి సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు.అర్జీలు మరల మరల పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు.అర్జీదారులు మొత్తం 66 మంది అర్జీలను అందజేశారు.ఈ కార్యక్రమంలో రేపల్లె డిఎస్పీ ఏ.శ్రీనివాస రావు,బిసిఆర్బి ఇనిస్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు ,అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

కలెక్టర్ వి.వినోద్‌కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో ప్రజలకు నాణ్యమైన సేవలందించి సంతృప్తి పరచాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో అధికారుల దగ్గరకు సమస్యలను చెప్పుకోవడానికి వస్తారని అధికారులు సావధానంగా విని వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన చెప్పారు.జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెవెన్యూ,పోలీస్,సర్వే శాఖలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని సమస్యలు పరిశీలించడానికి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు.మండల స్థాయిలోప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా పాల్గొనా లని ఆయన చెప్పారు.సంతమాగులూరు మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు ఎక్కువ శాతం పెండింగ్ ఉన్నాయని వాటిని పరిష్కరించ డానికి చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో ఈనెల 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు సి.పి ఆర్ వారోత్సవాలను నిర్వహించాలని కలెక్టర్ అన్నారు.అత్యవసర సమయాల్లో ప్రజలను ప్రాణా పాయం నుండి రక్షించడానికి ప్రతి ఒక్కరూ సి.పి.ఆర్ గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా చీరాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ శ్రీకాంత్,డాక్టర్ శ్రీదేవి సి.పి.ఆర్ గురించి అధికారులకు డెమోను ప్రదర్శించి చూపించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, కె.ఆర్.సి డిప్యూటీ కలెక్టర్ ఎస్. లవన్న,జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ,జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధా మాధవి,జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్ దిబోరా,జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్రయత్నంలోనే ఉపాధ్యాయ ఉద్యోగం

విశాలాంధ్ర - నిజాంపట్నం : తొలి ప్రయత్నం లోనే ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం తన జీవితంలో మరచిపోలేని ఘట్టమని నూతన ఉపాధ్యాయురాలు పఠాన్ ఫర్హీన్ అన్నారు.సోమవారం ఆమె నిజాంపట్నం పంచాయతీ ఎక్స్‌మిలటరీ కాలనీలోని ఉర్దూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరారు.ఈ సందర్భంగా ఫర్హీన్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ-2025 పరీక్షలో ఉర్దూ మీడియం ఎస్జీటీ విభాగంలో 55వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు.

విషాద కుటుంబాలకు ఎమ్మెల్సీ పోతుల సునీత పరామర్శ

విశాలాంధ్ర - చీరాల : సముద్ర స్నానానికి వెళ్లి దురదృష్టవశాత్తు మృతి చెందిన వడ్డి సంఘానికి చెందిన గౌతమ్,షాలెం కుటుంబాలను ఎమ్మెల్సీ పోతుల సునీత ఆదివారం పరామర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు.కాంపెన్సేషన్ ఇవ్వడంతో పాటు,కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ప్రభుత్వం ఉద్యోగం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను అని తెలిపారు.మట్టి ఖర్చుల నిమిత్తం గౌతమ్,షాలెం కుటుంబాలకు చెరో రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు బండారుపల్లి హేమంత్,మువ్వల వెంకటరమణ, అరవపల్లి కుమార్, నాశన మణికుమార్,డాక్టర్ తాడివలస దేవరాజు,కృష్ణ అర్జున్,గోలి సాయి,ఆది గావిని,డానియల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రాంతి కుమార్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-మార్కాపురం : రైతుల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం కృషి చేయాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్ అన్నారు. తర్లుపాడు మండల పిఎసిఎస్ సింగిల్విండో చైర్మన్ వెలుగు క్రాంతి కుమార్ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జరిగింది. రాష్ట్ర టిడిపి పరిశీలకులు శాసనాల వీం బ్రహ్మం, టిడిపి వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లి కార్జునరావు, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, జవ్వాజి రామాంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యాన్ని అరికట్టాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తూ కుటీర పరిశ్రమలాగా పెంపొందిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసిపీ నాయకులు నినాదాలతో ప్రదర్శనగా వెళ్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారికి అర్జీ అందజేశారు.వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో నకిలీ మద్యం ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వంపై ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వమే నకిలీ మద్యాన్ని ప్రోత్సహించే విధానాన్ని చెప్పటం దారుణమైన పరిస్థితి అన్నారు. పేదల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల కోసం ప్రభుత్వ ఆసుపత్రి,మెడికల్ కాలేజీలని నిర్మించాలని చూస్తే ఈ ప్రభుత్వం కల్తీమద్యంతో వాళ్ళ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నదన్నారు. పిట్టలవాని పాలెం మండలం మహిళా అధ్యక్షురాలు బడుగు మాధవి మాట్లాడుతూ పేద ల జీవితాలు కూలి పోతున్నాయని దీని తక్షణమే అరికట్టాలన్నారు. బాపట్ల ఆర్టిఐ విభాగ అధ్యక్షులు జోగి రాజా మాట్లాడుతూ అధికారంలో రాకముందున నాణ్యమైన మద్యం తక్కువ దొరకే అందిస్తామని నమ్మబలికిన చంద్రబాబునాయుడు ఈ కూటమి ప్రభుత్వం రాగానే నకిలీ మద్యాన్ని తయారు చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొక్కిలి గడ్డ చెంచయ్య, పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు,బాపట్ల మండలం ఎంపీపీ హరిబాబు, బాపట్ల మండల అధ్యక్షులు మరిప్రోలు ఏడుకొండలు రెడ్డి,బీసీ సెల్ అధ్యక్షులు పీట వేణు,మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి,నామన చక్రపాణి,గుడారంకయ్య, పట్టణ బీసీ నాయకులు వెంకట్రావు,మండల నాయకులు సుబ్బారావు, పట్టణ ప్రతినిధి ఇమ్మ డిశెట్టి శ్రీను,పవన్,అదే చందు,లక్ష్మణ్, చంటి,కొండలు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-త్రిపురాంతకం : కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కౌలు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు.ఖరీఫ్ సీజన్ మొదలై రైతులు పంటను వేయడం మొదలెట్టారు. భూములు లేకపోయినా వ్యవసాయం చేసే రైతులు వ్యవసాయంపై మక్కువ పోక కౌలుకు పొలాన్ని సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో కౌలు రైతులు పంటను వేసి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కౌలు రైతులను అధిక సంఖ్యలో సమీకరించి రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. సీపీఐ మండల కార్యదర్శి దాసరి మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

సీబీఐ ఎంక్వైయిరీ వేయాలి

విశాలాంధ్ర-చీమకుర్తి : సంతనూతలపాడు నియోజకవర్గ చీమకుర్తిలో నకిలీ మద్యంపై మాజీ మంత్రివర్యులు డాక్టర్ మేరుగ నాగార్జున సారధ్యంలో మహిళలు నాయకులతో కలిసి రాస్తారోకో,ఆందోళనలు చేపట్టారు. డాక్టర్ మేరుగు నాగార్జున మాట్లాడుతూ నకిలీ మద్యంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సిబిఐ ఎంక్వయిరీ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని, ప్రజలు ప్రాణాలు రక్షించాలని అన్నారు. భారీ నిరసన ర్యాలీలో కల్తీ మద్యం నివారించాలని కోరుతూ మహిళలతో కలిసి ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం సమర్పించిన మేరుగు నాగార్జున మరియు చీమకుర్తి మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, తదితరులు ఉన్నారు.

ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్ని ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.అమ్మ వారి ఆలయ నూతన పాలకవర్గ సభ్యులుగా కలకోట చక్రధర్‌రెడ్డి,కె.నాగవేణి, ఎ.వి.పద్మజ, యన్. సముద్రాలు, వెంకటప్పయ్య, ఎ.ఉషారాణి,కె. పట్టాభిరామారావు,కె.అశోక్,కె.శివలీలా,వి.ప్రసాద్ ,సిహెచ్.రాంబాబు,డి.బాలాజీ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల పార్టీ అధ్యక్షుడు అఫ్జల్,మాజీ మండల పార్టీ అధ్యక్షులు కనుమూరి సాంబమూర్తి రాజు, వెంకటపతిరాజు,శివాలయం కమిటీ చైర్మన్ పరిమి రామకృష్ణ సాయిబాబు,చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఇందూరి సాయి గుప్తా, తెలుగుదేశం జనసేన బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.